


లీకవుతున్న తాగునీటి పైపులైన్లు

జీవీఎంసీ 33వ వార్డు పరిధి కృష్ణాగార్డెన్స్‌లో మూడు రోజుల కిందట డయేరియా ప్రబలింది. నెలరోజుల కిందట దక్షిణలోని జబ్బర్‌తోట, పక్షం రోజుల కిందట గాజువాకలో ప్రబలిన డయేరియా.. ప్రస్తుతం కృష్ణాగార్డెన్స్ ప్రజలపై పంజా విసిరింది. దీంతో 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 17 మందికి వ్యాధి నిర్ధారణ అయింది. వారికి చికిత్స అందిస్తున్నారు. ఈ వ్యాధి సోకడానికి తాగునీటి పైప్‌లైన్లలోకి మురుగు నీరు చేరడమే కారణమని తెలుస్తోంది. ఆ నీటిని తాగడం వల్ల స్థానికులు ఈ వ్యాధి బారిన పడుతున్నారని పైప్‌లైన్లకు మరమ్మతులు, కొత్త పైప్‌లైన్ల ఏర్పాటు, వైద్య శిబిరం నిర్వహణ వంటి చర్యలు యుద్ధప్రాతిపదికన చేపట్టారు.

డేంజర్ బెల్స్



- కృష్ణాగార్డెన్స్‌లో విజృంభిస్తున్న డయేరియా
- కొనసాగుతున్న సహాయక చర్యలు
- 150 మందికి పరీక్షలు చేయగా 17 మందికి నిర్ధారణ
- యుద్ధ ప్రాతిపదికన పైప్ లైన్ల మార్పు

ఇంతలో ముంచుకొచ్చింది..

ఇంతలో డయేరియా మహమ్మారి ముంచుకొచ్చింది. భూగర్భ డ్రైనేజీ ద్వారా మురుగు నీరు జీవీఎంసీ సరఫరా చేసే తాగునీటి పైపులైన్లలోకి వచ్చేసింది. ఆ మురుగు నీటినే స్థానికులు కొంత కాలంగా తాగేవారు. దీంతో పలువురు వాంతులు, విరేచనలు, జ్వరాలతో సతమతమవుతూ ఇబ్బందులు పడేవారు. సమస్య (సాక్షి) మీడియా దృష్టికి వెళ్లింది. కృష్ణాగార్డెన్స్‌లో డయేరియా పేరిట సాక్షి వార్త ప్రచురించింది. ఈ విషయం జీవీఎంసీ, వైద్య ఆరోగ్య శాఖకు తెలిసింది. దీంతో యుద్ధప్రాతిపదికన చర్యలకు దిగారు. 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా, వారిలో 17 మందికి డయేరియా సోకిందని తేలింది. వీరిలో ఒకరు ఐసీయూలో చికిత్స పొందుతుండగా మరికొందరు ఇంటి వద్ద, ఇంకొందరు పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మరిన్ని కేసులు నమోదయ్యే అవకాశం ఉన్నందున జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జీవీఎంసీ సంయుక్తంగా శిబిరం ఏర్పాటు చేశాయి. గత మూడు రోజులుగా డయేరియా కేసులు నమోదవ్వకపోయినా విషజ్వరాలు.. తలనొప్పితో బాధపడుతున్నట్టు వైద్య సిబ్బంది దృష్టికి వచ్చింది. వారికి ఉచితంగా మందులు అందజేస్తూ శిబిరాన్ని కొనసాగిస్తున్నారు.

దాబాగార్డెన్స్: అతిసార సోకి పలువురు మంచాన పడ్డారు. నెల రోజుల కిందట జబ్బర్‌తోటలో విజృంభించిన డయేరియా వల్ల అప్పట్లో పలువురు ఇబ్బంది పడగా, ఇద్దరు కిడ్నీ ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్నారు. పక్షం రోజుల కిందట గాజువాకలో డయేరియా మహమ్మారి ప్రబలి పలువురు మంచం పట్టగా.. మరికొందరు ఆస్పత్రిలో చికిత్స పొందారు. తాజాగా నగర నడిబొడ్డు 33వ వార్డు పరిధి కృష్ణాగార్డెన్స్‌లో మూడు రోజుల కిందట డయేరియా విజృంభించింది. వాంతులు.. విరేచనాలతో పలువురు వ్యాధి బారిన పడ్డారు. మరికొందరు ఆస్పత్రుల చుట్టూ తిరిగారు. పరిస్థితి గమనించిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జీవీఎంసీ సంయుక్త ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున చర్యలకు శ్రీకారం చుట్టారు. ఈ ప్రాంతంలో 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 17 కేసులు నిర్ధారణ కాగా.. వీరిలో ఒకరు ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. మిగిలిన వారిలో కొందరు ఇంటి వద్ద, మరి కొందరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

కారణమేమిటి?

వార్డు పరిధి కృష్ణాగార్డెన్స్‌లో గత కొంత కాలంగా జీవీఎంసీ సరఫరా చేసే తాగునీరు పూర్తిగా కలుషితమై వస్తోంది. ఈ విషయాన్ని స్థానికులు జీవీఎంసీ దృష్టికి తీసుకెళ్లారు. వార్డు కార్పొరేటర్, ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. అయినా ఫలితం లేదు. జీవీఎంసీ చుట్టూ తిరిగారు.. స్పందన కరవైంది. తిరిగి తిరిగి స్థానికులు ఆ సమస్య పరిష్కారం కాకపోవడంతో వదిలేశారు.



కృష్ణాగార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం



భూగర్భ డ్రైనేజీ ఎక్కడ లీకయిందో తెలుసుకోవడానికి తవ్వి సొరచూస్తున్న రోడ్డును తవ్వుతున్న దృశ్యం

పైప్‌లైన్ల మార్పు.. వైద్య శిబిరం నిర్వహణ

సమస్య జటిలం కావడంతో ప్రజా ప్రతినిధులు జీవీఎంసీని హెచ్చరించారు. సమస్య పరిష్కరించకపోతే స్థానికులు మండిపడే అవకాశం ఉన్నందున వెంటనే చర్యలు చేపట్టాలని పరుగులు పెట్టారు. దీంతో జీవీఎంసీ స్పందించింది. నాలుగు అడుగుల లోతున ఉన్న పాత పైపులైన్లను తొలగించి కొత్త పైపులైన్లు వేస్తున్నారు. భూగర్భ డ్రైనేజీ ద్వారా ఎక్కడ మురుగు నీరు లీకవుతుందో తెలుసుకునేందుకు రోడ్లు తవ్వి చర్యలు చేపడుతున్నారు. లీకేజీలకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. డోర్ టు డోర్ వెళ్లి వైద్య పరీక్షలు చేస్తూ.. స్థానికుల ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకుంటున్నారు. మందులు అందుబాటులో ఉంచారు.



పాత పైప్‌లైన్లు తొలగించేందుకు గోతులు తవ్వుతున్న సిబ్బంది

క్లుప్తంగా

4న భువనేశ్వరీదేవికి అధివాసం



భువనేశ్వరిదేవీ

దాబాగార్డెన్స్: యాతపాలెం గ్రామం ఆరిపాక పంచాయతీ మణిపురంలో గల ఓం భువనేశ్వరీ సంస్థాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 4న భువనేశ్వరీదేవికి తెల్ల జిల్లేడు పత్రితో అధివాస మహోత్సవం నిర్వహించనున్నట్టు భువనేశ్వరీదేవి ఆరాధన పీఠం నిర్వాహకుడు మురళీకృష్ణ తెలిపారు. ఈ మహోత్సవంలో పాల్గొనే భక్తులు అమ్మవారికి మంగళ స్నానం, దివ్య పంచామృతాలతో పాలు తదితర కర్పూరాది సుగంధ ద్రవ్యాలతో పూజలు నిర్వహించవచ్చని తెలిపారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం



ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న ఈవో, భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన శ్రీఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ఆలయ ఈవో రమాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వహస్తాలతో అమ్మవారికి జలాభిషేకం నిర్వహించారు. భక్తుల గోత్రనామాలతో అమ్మవారికి విశేష పూజలు జరిగాయి. సాయంత్రం అమ్మవారిని నూతన చీర, పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

'అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి'



నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

దాబాగార్డెన్స్: కేంద్ర హోం మంత్రి అమిత్ షా డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్‌ను విమర్శించినా ఇప్పటి వరకు చర్యలు చేపట్టకపోవడంపై సీపీఎం మండిపడింది. కమ్యూనిస్టుల పిలుపు మేరకు గత నెల 30 నుంచి దేశవ్యాప్త ఆందోళనలు.. నిరసనలు చేపట్టే కార్యక్రమాల్లో భాగంగా బుధవారం పూర్ణామార్కెట్‌లో ముఠా కళాసీ యూనియన్ నాయకుడు ఎం. సుబ్బారావు నేతృత్వంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం నాయకుడు చంద్రమౌళి మాట్లాడుతూ అంబేడ్కర్‌పై అవమానకర వ్యాఖ్యలు చేసి యావత్ దేశ ప్రజలను ఆవేదనకు గురి చేశారని, అటువంటి వ్యక్తిపై ఎందుకు చర్యలు చేపట్టలేదని ప్రశ్నించారు. వెంటనే అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు మన్మథరావు, పైడిరాజు, ఆర్. నాయుడు, నర్సింగరావు, మహేష్, నారాయణ, రమణ, సంజీవ్, సాంబ, శ్రీను, సూరి, పెద్ద ఎత్తున కళాసీలు పాల్గొన్నారు.

షెల్టర్ హోంకు మహిళ తరలింపు



మహిళ వివరాలు తెలుసుకుంటున్న షెల్టర్ మేనేజర్

సీతమ్మధార: ఆదర్శ్‌నగర్, ఓల్డ్ డైరీఫారం ప్రాంతాల్లో బిచ్చమెత్తుకుంటూ జీవించే నరసమ్మ (45) అనే మహిళను బుధవారం ఏయూటీడీ సిబ్బంది టీఎస్ఆర్ కాంప్లెక్సులోని ఏయూటీడీ మహిళా షెల్టర్ హోంకి తరలించారు. ఆమెకు స్నానం చేయించి, బట్టలు మార్చి, వైద్య పరీక్షలు చేయించారు. వసతిగృహం మేనేజర్ జ్యోతిర్మయి, కేర్‌టేకర్లు పాల్గొన్నారు.

కిటకిటలాడిన ఆలయాలు



విశేష అలంకరణలో బల్లిగిరి వేంకటేశ్వరస్వామి



నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

దాబాగార్డెన్స్: నూతన సంవత్సరం సందర్భంగా కనకమహాలక్ష్మి అమ్మవారి దర్శనానికి బుధవారం భక్తులు పోటెత్తారు. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, వేదపండితులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

భక్తుల ప్రత్యేక పూజలు..

మహారాణిపేటలో గల అంబికాబాగ్ రామాలయంలో సీతారామచంద్రస్వామి ఆలయం, జిల్లా పరిషత్ జంక్షన్‌లో గల శ్రీకృష్ణ చైతన్య మఠం, పూర్ణామార్కెట్ మెయిన్‌రోడ్డులో గల ఆంజనేయ స్వామి ఆలయం, టౌన్‌కొత్తరోడ్డులో గల వినాయకుని ఆలయం, జగన్నాథస్వామి ఆలయం, కురుపాం మార్కెట్ సమీపాన కన్యకా పరమేశ్వరి ఆలయం, వెలంపేటలో గల దుర్గాలమ్మ టెంపుల్, అల్లిపురం మెట్టపై గల వేంకటేశ్వరస్వామి ఆలయం, పోర్టు వేంకటేశ్వరస్వామి ఆలయం, దొండపర్తిలోని ఎరుకుమాంబ ఆలయం భక్తులతో కిటకిటలాడాయి.

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు..

నియోజకవర్గ పరిధి సెయింట్ ఆంథోనీ చర్చి, ట్రినిటీ లూథరన్ చర్చి, కల్వరి బాప్టిస్ట్ చర్చి, ఆంధ్రా బాప్టిస్ట్ చర్చి, సెయింట జాన్స్, సెయింట్ అలోసిస్ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.



కనకమహాలక్ష్మి అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

ఆలయాలకు భక్తుల తాకిడి..

అల్లిపురం: నూతన సంవత్సరం సందర్భంగా బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం, అస్సాం గార్డెన్స్‌లో గల నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం, శ్రీ శివరామకృష్ణ దేవస్థానం, అచ్చియ్యమ్మపేట శ్రీ షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరం, అభయ హస్తాంజనేయ స్వామి దేవాలయాలల్లో పూజలకు భక్తులు బారులుతీరారు.

నేతలకు శుభాకాంక్షలు



వాసుపల్లి గణేష్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న పార్టీ నాయకులు



జాన్‌వెస్లీకి శుభాకాంక్షలు తెలుపుతున్న పార్టీ శ్రేణులు

దాబాగార్డెన్స్: నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పార్టీ క్రిస్టియన్ మైనార్టీ విభాగ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లవరపు జాన్‌వెస్లీని బుధవారం ఆయన కార్యాలయంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సనపల రవీంద్రభరత్, ముత్తాబత్తుల రమేష్, బెవర మహేష్, కంటుముచ్చు సాగర్, పెనుగంటి సూర్యానాయుడు తదితరులు పాల్గొన్నారు.

నీల్ అముండ్‌సన్ విగ్రహం ఏర్పాటు



నీల్ అముండ్‌సన్ విగ్రహం ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ వీఆర్‌కే ప్రసాద్, ప్రిన్సిపాల్ వెంకటరమణ

మురళీనగర్ : కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇన్‌స్టిట్యూట్ (గైస్)లో ఆధునిక కెమికల్ ఇంజినీరింగ్ పితామహుడు నీల్ అముండ్‌సన్ విగ్రహాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముంబయిలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ పూర్వ వీసీ పద్మశ్రీ జీడీ యాదవ్ ఆన్‌లైన్‌లో, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ స్టడీస్ వ్యవస్థాపక డైరెక్టర్ ప్రొఫెసర్ వీఎస్ఆర్‌కే ప్రసాద్ సంయుక్తంగా విగ్రహాన్ని ఆవిష్కరించారు. డాక్టర్ బీవీ లక్ష్మణరావు సహకారంతో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ప్రొఫెసర్ వీఆర్‌కే ప్రసాద్ మాట్లాడుతూ ఆధునిక యుగంలో కెమికల్ ఇంజినీరింగ్ విద్యను అభ్యసిస్తున్న ప్రతి ఒక్కరికీ నీల్ అముండ్‌సన్ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఢిల్లీ ఐఐటీ ప్రొఫెసర్ యు.శ్రీదేవి, కెమికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ బీవీ లక్ష్మణరావు, ఆయిల్ టెక్నాలజీ ఇన్‌చార్జి హెడ్ డి.దామోదర్, పెట్రో కెమికల్ ఇంజినీరింగ్ హెడ్ సీహెచ్ జయప్రకాషరెడ్డి, ప్లాస్టిక్ అండ్ పాలిమర్స్ ఇన్‌చార్జి హెడ్ డాక్టర్ ఎస్.ప్రశాంతకుమారి, సీనియర్ లెక్చరర్ డాక్టర్ ఎం.విజయలక్ష్మి, జనరల్ విభాగం ఫిజిక్స్ లెక్చరర్ ఆర్.జ్యోతి పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



షిర్డీ సాయిబాబా క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఉమ్మిడి నాగరాజు తదితరులు



డైరీ ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు తదితరులు

అల్లిపురం: అచ్చియ్యమ్మపేట, శ్రీ షిర్డీ సాయి ధ్యాన మందిరంలో షిర్డీ సాయినాథుని క్యాలెండర్ ఆవిష్కరించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని షిర్డీ సాయినాథునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా షిర్డీ సాయిబాబా ముఖచిత్రంతో ముద్రించిన 2025 నూతన క్యాలెండర్‌ను ఆలయ అధ్యక్షుడు ఉమ్మిడి నాగరాజు, భక్తులు ఆవిష్కరించారు.

ఎస్‌సీఆర్‌డబ్ల్యూఏ డైరీ ఆవిష్కరణ..

స్మార్ట్ సిటీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్-2025 నూతన డైరీని పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆవిష్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు బంగారు అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఎంవీఎస్ అప్పారావు, ముఖ్య సలహాదారు కర్రి సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ కె. వినోద్ తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో..

మహారాణిపేట: నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి. జగదీశ్వరరావు బుధవారం ఆవిష్కరించారు. టీబీ కంట్రోల్ ఆఫీసర్ డాక్టర్ పూర్ణేంద్రబాబు, నేషనల్ హెల్త్ మిషన్ గౌరవ అధ్యక్షుడు శశిభూషణ్, అధ్యక్షుడు ఆర్. సురేష్, ఉపాధ్యక్షుడు మోహన్, సెక్రటరీ వీరబ్రహ్మం, ట్రెజరర్ గోపీనాథ్, డీపీ సి. శ్రీనివాస్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు



డైరీ ఆవిష్కరిస్తున్న సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ తదితరులు

మేయర్‌కు శుభాకాంక్షలు



మేయర్ హరివెంకట కుమారికి శుభాకాంక్షలు తెలుపుతున్న జీవీఎంసీ అధికారులు

ఆరిలోవ : నూతన సంవత్సరం సందర్భంగా మేయర్ గొలగాని హరి వెంకటకుమారికి బుధవారం పలువురు శుభాకాంక్షలు తెలిపారు. పెదగదిలిలోని మేయర్ క్యాంప్ కార్యాలయంలో డిప్యూటీ మేయర్లు, పలువురు కార్పొరేటర్లు, పలు రాజకీయ పార్టీల నాయకులు, జీవీఎంసీలో వివిధ విభాగాల అధికారులు, జోనల్ అధికారులు ఆమెను కలిశారు. పూల బొకేలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆమెను కలవడానికి వచ్చిన అధికారులు, నాయకులతో మేయర్ క్యాంప్ కార్యాలయం సందడిగా మారింది.

తాగునీరు వృథా



ఏయూ క్యాంపస్ : రహదారిపై పైప్‌లైన్‌కు రంధ్రం పడడంతో వందల లీటర్ల తాగునీరు వృథాగా పోతోంది. చినవాల్తేరు నుంచి పెదవాల్తేరుకు వెళ్లే మార్గంలో స్పీడ్ బ్రేకర్ వద్ద పలు చోట్ల పైప్‌లైన్‌కు రంధ్రాలు పడ్డాయి. దీంతో నీరు వృథాగా రోడ్డు మీద ప్రవహిస్తోంది. రహదారి మొత్తం నీటితో నిండిపోవడంతో ఈ మార్గంలో వెళ్లే వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. జీవీఎంసీ నీటి సరఫరా విభాగం సిబ్బంది దృష్టి సారించి, నీటి వృథాను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మెలగాలి

మురళీనగర్: ప్రజలు ఆధ్యాత్మిక చింతనతో మెలగాలని పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ సూచించారు. మురళీనగర్‌లోని సీతా రామాలయాన్ని బుధవారం ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుటుంబంతో అందరూ ఆయురారోగ్యాలతో గడపాలంటే దేవుని ఆశీస్సు లు అవసరమన్నారు. చుట్టూ ఉన్న పేదలకు సాయం చేయాలని పిలుపునిచ్చారు. నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరూ రోజుకి ఏదో ఒక మంచి పని చేయాలని సూచించారు. ముందుగా అర్చకు లు అయలూరి రామశాస్త్రి, ఆలయ కమిటీ సభ్యు లు సీపీకి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని సీతారామచంద్రుడితోపాటు లలితాదేవి, ఉమారామలింగేశ్వరుడు, షిర్డీ సాయి బాబాను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయంలో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో టి.నారాయణ రెడ్డి, సనపల వరప్రసాద్, పెంటకోట శ్రీనివాసరావు, ఎస్ఎంకే మోహన్ ఆనంద్, సీతిన సత్యనారాయణ విజయలక్ష్మి క్ష్మి, ఇతర సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

'రిటైర్‌మెంట్ వయసు తగ్గింపు నిర్ణయం సరికాదు'

దాబాగార్డెన్స్: పదవీ విరమణ వయసు 62 నుంచి 60 ఏళ్లకు తగ్గించడం వల్ల కార్మికులు ఆవేదనకు గురవుతున్నారని, 62 ఏళ్ల వరకు కొనసాగించాలంటూ గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు పి. వెంకట్‌రెడ్డి, అధ్యక్షుడు టి. నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఉరుకుటి రాజు కమిషనర్ సంపత్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. తగ్గింపు సర్క్యులర్ కార్మికులకు పిడుగు లాంటి వార్తని, సర్క్యులర్ చూసి కార్మికులు ఆందోళనలో ఉన్నారని తెలిపారు. అదనపు కమిషనర్ విభాగంలో 8 మంది, యూసీడీలో 18, ఐటీలో ఇద్దరు, ఆర్టికల్చర్‌లో ముగ్గురు, చీఫ్ ఇంజినీర్ కార్యాలయంలో 17 మంది, నీటి సరఫరా, యూజీడీ విభాగంలో 90 మంది, విద్యా విభాగంలో 28 మంది పదవీ విరమణ/చనిపోవడం కారణంగా ఆ ఖాళీలు ఏర్పడ్డాయన్నారు. సిబ్బంది కొరతతో ఇప్పటికే పని భారం పెరిగిందని, దీనికి తోడు సుమారు 400 మంది వరకు కార్మికులను రిటైర్మెంట్ వార్త గందరగోళంలో పడేసిందన్నారు. ఇప్పటి వరకు 62 ఏళ్ల విధానాన్నే కొనసాగించాలని, లేనిచో రిటైర్ అయిన వారి వారసులకు, పెండింగ్‌లో ఉన్న రిటైర్మెంట్/చనిపోయిన/అనారోగ్యం పాలైన వారి దరఖాస్తుల ప్రకారం రిక్రూట్‌మెంట్ చేసే వరకు కొనసాగించాలని కమిషనర్‌ను కోరారు. లేనిచో నీటి సరఫరాతో పాటు పారిశుద్ధ్య కార్మికులు, ఇతర విభాగాల కార్మికులు సమ్మెలోకి వెళ్లడం తప్ప, మరో మార్గం లేదని ఆ వినతిలో పేర్కొన్నారు.

నూతన సంవత్సర వేడుకల హంగామా



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న పోర్టు చైర్‌పర్సన్ అంగముత్తు



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న బిషప్ జయరావు, ఫాదర్ జాన్‌ప్రకాష్



కేక్ కట్ చేస్తున్న 41వ వార్డు కార్పొరేటర్ పూర్ణిమ



పాపాహోమ్ పిల్లలచే కేక్ కట్ చేయిస్తున్న అధికారి గజేంద్రకుమార్



కళా ఆస్పత్రిలో కేక్ కట్ చేస్తున్న డాక్టర్ రమణమూర్తి

విశాఖ సిటీ: విశాఖ పోర్టు అథారిటీ (వీపీఏ)లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. సాంబమూర్తి ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పోర్టు చైర్‌పర్సన్ డాక్టర్ ఎం.అంగముత్తు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోర్ట్ క్యాలెండర్, ప్రత్యేకంగా రూపకల్పన చేసిన బ్రెయిలీ లిపి క్యాలెండర్, టేబుల్-టాప్ క్యాలెండర్, రిటైర్డ్ ఆఫీసర్స్ డైరీలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన అధికారులు, ఉద్యోగులు, వాటాదారులు, ఉద్యోగ సంఘాలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ స్వామి, విభాగాధిపతులు, వాటాదారులు, సంఘ నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

పునీత పేతురు దేవాలయంలో..

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ కెథడ్రల్ మైదానంలో గల పునీత పేతురు దేవాలయంలో పారిస్ పాస్టిల్ కౌన్సిల్ (పీపీసీ) చర్చి ఫాదర్ రెవరెండ్ జొన్నాడ జాన్‌ప్రకాష్ సంయుక్త ఆధ్వర్యంలో ఆరాధన దివ్యపూజ బలి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విశాఖ జిల్లా అగ్రపీఠం పరిపాలనాధికారి బిషప్ రెవరెండ్ పొలిమేర జయరావు పాల్గొని ముఖ్య సందేశం ఇచ్చారు. ఫాదర్ అంథోనీరాజ్, వినయ్‌కుమార్, పీపీసీ సభ్యులు, భక్త సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ 41వ వార్డులో..

కంచరపాలెం: జీవీఎంసీ41వ వార్డు జ్ఞానాపురం పరిధి వైఎస్సార్‌సీపీ వార్డు కార్యాలయంలో పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్ నేతృత్వంలో బుధవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ కేక్ కట్ చేసి వార్డు ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్‌సీపీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

పాపా హోంలో..

దాబాగార్డెన్స్: పోలీస్ బ్యారెక్స్‌లో గల పబ్లిక్ అండ్ పోలీస్ అసోసియేషన్ ఫర్ స్ట్రీట్ చిల్డ్రన్స్ (పాపాహోమ్)లో బుధవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. అధికారి గజేంద్రకుమార్ పాల్గొని పాపాహోమ్ పిల్లల సమక్షంలో కేక్ కట్ చేసి బాలలకు తినిపించి నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పాపాహోమ్ అధ్యక్షుడు డి. సూర్యప్రకాశరావు, ఉపాధ్యక్షుడు పంపాన వెంకటేశ్వరరావు, కోశాధికారి రమేష్‌చంద్, కార్యవర్గ సభ్యులు భాస్కర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కళా ఆస్పత్రిలో..

సీతమ్మధార: కళా హాస్పిటల్ అధినేత డాక్టర్ పైడి వెంకట రమణమూర్తి, డాక్టర్ కళావతి ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో డాక్టర్ యశస్విని, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఏయూటీడీ వసతిగృహంలో..

ద్వారకానగర్ టీఎస్ఆర్ కాంప్లెక్సులో గల జీవీఎంసీ - ఏయూటీడీ వసతిగృహంలో బుధవారం నూతన సంవత్సరం వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు కేక్ కట్ చేసి నిరాశ్రయులకు పంపిణీ చేశారు. వసతిగృహం మేనేజర్ జ్యోతిర్మయి, కేర్‌టేకర్లు పాల్గొన్నారు.